Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శనివారం
14 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 128
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

మేడ్చల్

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar



## ట్రిబ్యునల్ అవసరమే లేదు

### బ్రిజేశ్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి ప్రత్యేక ట్రిబ్యునల్ అవసరమే లేదని ఏపీ సర్కారు పేర్కొన్నది. ఈ మేరకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ దాఖలు చేసిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)పై తాజాగా కౌంటర్ రిజాయిండర్‌ను సమర్పించింది. అంతర్‌రాష్ట్ర నదీవివాదాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం విచారణ జరిపి ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలు కలిపి మొత్తం 1,050 టీఎంసీల కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీ మధ్య పునఃపంపిణీ చేయాలని, ఆ జలాలను ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని పేర్కొంటూ నిరుడు అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ విచారణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఎస్‌వోసీని సమర్పించింది. తెలంగాణలోని ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపు ఆవశ్యకత తదితర అంశాలను అందులో - మిగతా3లో

# సహాయం అందించండి

- కేంద్రం ఎలాంటి షరతులు లేకుండా నిధులు ఇవ్వాలి
- రాష్ట్రం మునిగినా ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులు వాడుకోలేని స్థితి
- ఎస్‌ఎస్‌ఆర్, ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు పొంతన లేకపోవడం వల్లే..
- 1350 కోట్ల నిధులున్నా రూపాయి వాడుకోలేకపోతున్నాం
- విపత్తు నిధులపై ఉన్న నిబంధనలను కేంద్రం సడలించాలి
- మున్నేరు ముప్పు నివారణకు రిటైనింగ్ వాల్ తప్పనిసరి
- నిర్మాణానికి కేంద్రం సహకరిస్తే మా వాటా నిధులిస్తాం
- వైపరీత్యాలపై హెచ్చరికల కోసం ఓ వ్యవస్థ ఉండాలి
- కేంద్ర బృందంతో భేటీ.. 10 వేల కోట్ల నష్టంపై నివేదిక
- 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవానికి' రండి
- కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్,
- కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు సీఎం రేవంత్ ఆహ్వానం



**శుభ తెలంగాణ హైదరాబాద్**

విపత్తుల నిధుల వినియోగానికి సంబంధించి అమల్లో ఉన్న కఠిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌లో రూ.1,350 కోట్లు అందుబాటులో ఉన్నా.. ప్రస్తుత నిబంధనల ప్రకారం రూపాయి కూడా వాడుకునే పరిస్థితి లేదని కేంద్ర బృందాలకు వివరించారు. కేంద్రం నిబంధనల ప్రకారం.. ఒక కిలోమీటరు రోడ్డు దెబ్బతింటే కేవలం రూ.లక్ష ఖర్చు చేయాలని నిర్ణయించారని, ఈ రేట్ల ప్రకారం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన తెలంగాణకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని.. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో శుక్రవారం సచివాలయంలో రేవంత్ సమావేశమయ్యారు. ఇటీవల కురిసన భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో సంభవించిన అపార నష్టాన్ని కేంద్ర బృందాలకు ఆయన వివరించారు. ఇప్పటి వరకు వివిధ శాఖల నుంచి అందిన వివరాల ప్రకారం రూ.10,032 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఇది మధ్యంతర నివేదిక మాత్రమేనని, పూర్తి వివరాలు రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతోపాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్‌ఎసఆర్ రేట్ల వివరాలను కూడా కేంద్రానికి - మిగతా3లో




### బిన్ లాడెన్ కొడుకు
## బతికే ఉన్నాడు?

- సంచలన విషయం వెలుగులోకి!
- ఉత్తర ఆఫ్ఘనిస్థాన్‌లో తలదాచుకుంటున్నాడన్న 'ది మిర్రర్' కథనం
- 450 మంది స్నైపర్లు అతడికి నిరంతరం భద్రత ఇస్తున్నారని వెల్లడి
- 2019లో అమెరికా వైమానిక దాడిలో మరణించినట్టు గతంలో వెలువడిన కథనాలు

### వయోవృద్ధులకు
# మోదీ ఆపన్నహస్తం

- వారికి ప్రధాని మోదీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించారు: కిషన్ రెడ్డి
- పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా ప్రయోజనం కలుగుతుందన్న కేంద్రమంత్రి
- ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామన్న కిషన్ రెడ్డి
- రానున్న రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది



**శుభ తెలంగాణ ఢిల్లీ**


70 ఏళ్లు దాటిన వారందరికీ ప్రధాని నరేంద్రమోదీ రూ.5 లక్షల ఆరోగ్య బీమాను కల్పించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారన్నారు. అందుకే ఈ ఆరోగ్య బీమాను తీసుకువచ్చారని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా 6 కోట్ల మంది వయోవృద్ధులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. రానున్న రెండేళ్లలో ఈ పథకంపై - మిగతా3లో




### రాహుల్ వ్యాఖ్యలు
## ఆందోళనకరం

- రిజర్వేషన్లను తొలగించాలనేది రాహుల్ గాంధీ ఆలోచనే..!
- భారత్ గురించి చెడుగా మాట్లాడటం అలవాటుగా మారింది
- కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్
- భారత్ వ్యతిరేకి ఇల్హార్ ఒమర్‌తో రాహుల్ భేటీ అయ్యారు

### ఎమర్జెన్సీని తలపించేలా
# కాంగ్రెస్ పాలన



- ఈ దాడుల కుట్రదారు రేవంత్ రెడ్డినే : హరీశ్‌రావు
- రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి
- ఎవరి మీద దాడులు చేయాలని రివ్యూలు చేస్తారా..?
- పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్‌ఎస్ పాలన సాగింది
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోంది
- శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు
- డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులకు హరీశ్ రావు సూచన
- డీజీపీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న హరీశ్ రావు
- గతంలో రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి వెళితే పోలీసులను తిట్టారని ఆరోపణ
- తప్పు చేయాలని రేవంత్ రెడ్డి చెప్పినా చట్టబద్ధంగా వ్యవహరించాలని హితవు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపించేలా ఉందని, ఈ దాడుల కుట్రదారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కోకాపేటలోని తన నివాసంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి కారణం ఎవరైనా ఉన్నారంటే రాష్ట్రం సీఎం రేవంత్ రెడ్డినే. చేసిందంతా చేసి ఇవాళ సీఎం శాంతి భద్రతల మీద రివ్యూ చేస్తారట. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడానికి కఠినంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ జితేందర్ ప్రెస్‌నోట్స్ ఇచ్చారు. నిన్న అరికెపూడి గాంధీకి అడిషనల్ డీసీపీని ఎస్కార్ట్‌గా పెట్టి 8 పోలీసు స్టేషన్లు దాటించి కౌశిక్ రెడ్డి - మిగతా3లో



### జైలు నుంచి
### అరవింద్ కేజ్రీవాల్ విడుదల

- సీబీఐ, ఈడీ కేసుల్లో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ అత్యున్నత ధర్మాసనం తీర్పు
- కొంతకాలంగా జైలు శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ సీఎం అరవింద్
- ఘనంగా స్వాగతం పలికిన ఆప్ నాయకులు

### త్వరలో ట్రాన్స్‌జెండర్లకు
# కొత్త బాధ్యతలు



- సీఎం రేవంత్ రెడ్డి వినూత్న ప్రయోగం..!
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ
- హోమ్ గార్డ్స్ తరహాలో వారికి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సీఎం సూచన
- రోడ్ల అభివృద్ధి, ఫుట్ పాత్ నిర్మాణాలు, ఇతర పనులను గడువులోపు పూర్తిచేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లదే

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి చరిత్ర సృష్టించబోతోంది. రాష్ట్రంలోనే తొలి గ్రామంగా రికార్డ్ నెలకొల్పేందుకు రెడీ అవుతోంది. ఇప్పటికే అధికారులు సర్వే కూడా చేపట్టారు. హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలను సులభతరం చేయడానికి ముఖ్యమంత్రి ముందుకొచ్చిన - మిగతా3లో

# బిన్ లాడెన్ కొడుకు బతికే ఉన్నాడు?

అమెరికా వైమానిక దాడిలో 2019లో చనిపోయాడని భావించిన ఒసామా బిన్ లాడెన్ కొడుకు హమ్జా బిన్ లాడెన్ సజీవంగా ఉన్నాడని 'ది మిర్రర్' సంచలన కథనాన్ని ప్రచురించింది. అతడు ఉగ్ర సంస్థ అల్ ఖైదాకు నాయకత్వం వహిస్తున్నట్టు ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా తెలిసిందని పేర్కొంది. హమ్జా తన సోదరుడు అబ్దుల్లా బిన్ లాడెన్‌తో కలిసి ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండి అల్ ఖైదాను రహస్యంగా నిర్వహిస్తున్నాడని పేర్కొంది. ఎన్ఎంఎఫ్ (నేషనల్ మొబిలైజేషన్ ఫ్రంట్) అనే తాలిబాన్ వ్యతిరేక మిలిటరీ కూటమి కూడా హమ్జా, అతడి అనుచరులు నిర్వహిస్తున్న కార్యకలాపాలను వివరిస్తూ ఒక నివేదికను విడుదల చేసింది. హమ్జాను 'ఉగ్రవాద యువరాజు'గా అభివర్ణించింది. అతడు ఉత్తర ఆఫ్ఘనిస్థాన్‌లో దాక్కున్నాడని, ఏకంగా 450 మంది స్నైపర్లు అతడికి నిరంతరం రక్షణ ఇస్తున్నారని తెలిపింది. 2021లో ఆఫ్ఘనిస్థాన్ పతనం తర్వాత ఆ దేశం వివిధ ఉగ్రవాద గ్రూపులకు ట్రైనింగ్ సెంటర్‌గా మారిందని ఎన్ఎంఎఫ్ నివేదిక అప్రమత్తం చేసింది. "హమ్జా బిన్




లాడెన్‌ను దారా అబ్దుల్లా ఖేల్ జిల్లాకు తరలించారు. అక్కడ 450 మంది అరబ్బులు, పాకిస్థానీలు అతడికి రక్షణ కల్పిస్తున్నారు. అతడి ఆధ్వర్యంలో అల్ ఖైదా మళ్లీ రూపు దిద్దుకుంటోంది. భవిష్యత్‌లో పాశ్చాత్య దేశాల లక్ష్యాలపై దాడులకు సిద్ధమవుతోంది" అని పేర్కొంది. ఒసామా బిన్ లాడెన్ హత్య తర్వాత అల్ ఖైదా బాధ్యతలు చేపట్టిన అల్-జవహిరితో హమ్జా సన్నిహితంగా కార్యకలాపాలు కొనసాగించినట్టు భావిస్తున్నట్టు పేర్కొంది. కాగా 2019లో అమెరికా జరిపిన వైమానిక దాడిలో హమ్జా మరణించాడని అంతా భావించారు. అమెరికా, ఇతర దేశాలపై దాడులు చేస్తామంటూ అతడు ఆడియో, వీడియో సందేశాలు విడుదల చేసిన కొంతకాలం తర్వాత హత్య వార్తలు వెలువడ్డాయి. అయితే మరణించిన ప్రదేశం, తేదీ అస్పష్టంగా ఉన్నాయని బీబీసీ కథనం పేర్కొంది. అమెరికా రక్షణశాఖ పెంటగాన్ కూడా ఈ అంశంపై స్పందించలేదు. కాగా హమ్జా బిన్ లాడెన్‌ను అమెరికా గ్లోబల్ టెర్రరిస్ట్‌గా గుర్తించింది. ఇరాన్‌లో గృహ నిర్బంధంలో ఉన్నట్లు భావిస్తున్నట్టు గతంలో ప్రకటించింది. ఇదిలావుంచితే హమ్జా తండ్రి ఒసామా బిన్ లాడెన్‌ను 2011లో పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో అమెరికా భద్రతా బలగాలు అంతమొందించాయి. ఓ కాంపౌండ్‌లో తలదాచుకుంటున్న అతడిని అమెరికా ప్రత్యేక దళాలు హతమార్చాయి. 2001 సెప్టెంబర్ 11 న అమెరికాలో ఉగ్రదాడులకు పాల్పడి 3,000 మంది అమాయుల మరణానికి అతడు కారణమైన విషయం తెలిసిందే.

# జైలు నుంచి అరవింద్ కేజ్రీవాల్ విడుదల

**ఢిల్లీ :** లిక్కర్ స్కాం కేసులో కొంతకాలంగా జైలు శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం సాయంత్రం తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. దాదాపు అయిదున్నర నెలలపాటు ఆయన జైలులో ఉన్నారు. ఎట్టకేలకు సుప్రీం కోర్టులో శుక్రవారం ఆయనకు ఊరట లభించింది.

సీబీఐ,ఈడీ కేసుల్లో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ అత్యున్నత ధర్మాసనం తీర్పు వెలువరించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిందనే సంబరాల నడుమ.. ఆప్ నేతలు, కార్యకర్తలు తిహార్ జైలుకు భారీగా చేరుకున్నారు. ఆయన బయటకు రాగానే పూలదండలతో స్వాగతం పలికారు. స్వీట్లు పంచుకుని, టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

సమన్ల నుంచి బెయిల్ వరకు

అక్టోబర్ 2023: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తొలిసారి సమన్లు జారీ చేసిన ఈడీ.

నవంబర్ 2, 2023: ఈడీ సమన్లను పక్కన పెట్టి మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలిలో ర్యాలీలో పాల్గొన్న సీఎం కేజ్రీవాల్.

డిసెంబర్ 2023: ఢిల్లీ మద్యం కుంభకోణంలో సీఎం కేజ్రీవాల్‌కు ఈడీ రెండోసారి సమన్ల జారీ చేసింది. ఇది రాజకీయ ప్రేరేపితం, అక్రమమంటూ దానిని సైతం సీఎం కేజ్రీవాల్ పక్కన పెట్టారు.

జనవరి 2024: ఈ కుంభకోణంలో ఈడీ ముచ్చటగా మూడోసారి సీఎం కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందంటూ ఆ సమన్లను సైతం పక్కన పెట్టిన సీఎం కేజ్రీవాల్.

జనవరి 18, 2024: ఢిల్లీ మద్యం కుంభకోణంలో



ప్రశ్నించేందుకు తమ ఎదుట హాజరుకావాలంటూ ఈడీ వరుసగా నాలుగోసారి సీఎం కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది.

ఫిబ్రవరి 02, 2024: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఐదువ సారి, ఆరవసారి జారీ చేసిన ఈడీ సమన్లను సైతం సీఎం కేజ్రీవాల్ విస్మరించారు. ఈ సమన్ల వ్యవహారంలో చట్టబద్ధతపై సీఎం కేజ్రీవాల్.. తన న్యాయవాద బృందంతో సంప్రదింపులు జరిపారు.

మార్చి 16, 2024: సమన్లకు హాజరు కావడంలో విఫలమైనందుకు ఈడీ దాఖలు చేసిన రెండు ఫిర్యాదులపై సెషన్స్ కోర్టు సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసింది.

మార్చి 21, 2024: ఈడీ సమన్లు జారీ చేయడంపై బలవంతపు చర్యల నుంచి రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సీఎం కేజీవాల్. అందుకు నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు.

మార్చి 21ఎం, 2024: ఇదే అంశంపై సీఎం కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మార్చి 21, 2024: తాము జారీ చేసిన తొమ్మిది సమన్లకు సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించలేదన్న ఈడీ. ఈ నేపథ్యంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన ఈడీ.

మే 10, 2024: లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారానికి అనుమతి ఇస్తూ.. సుప్రీంకోర్టు సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 1వ తేదీ తిరిగి తీహాడ్ జైల్లో లొంగిపోవాలని సీఎం కేజ్రీవాల్‌కు స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.

జూన్1, 2024: మధ్యంతర బెయిల్ కోసం ఢిల్లీ కోర్టును ఆశ్రయించిన సీఎం కేజ్రీవాల్

జూన్ 02, 2024: సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో తీహాడ్ జైల్లో లొంగిపోయిన సీఎం కేజ్రీవాల్

జూన్ 05, 2024: ఆరోగ్య కారణాల దృష్ట్యా సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన ఢిల్లీ కోర్టు

జూన్ 20, 2024: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు.

జూన్ 21, 2024: సీఎం కేజ్రీవాల్‌ను బెయిల్‌పై జైలు నుంచి విడుదల ఉత్తర్వులను నిలిపి వేయాలంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఈడీ.


జూన్ 26, 2024: సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ.

సెప్టెంబర్ 05, 2024: కేజ్రీవాల్ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ.. మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ ఇప్పించాలంటూ సీఎం కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ.. తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు.

సెప్టెంబర్ 13, 2024: సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

# మాండ్యలో మత ఘర్షణలు: ప్రభుత్వం సీరియస్.. పోలీసులపై వేటు

**బెంగళూరు :** కర్ణాటకలోని మాండ్య జిల్లాలో నాగమంగళ పట్టణంలో నవరాత్రులు సందర్భంగా వినాయకుడి ఊరేగింపు నేపథ్యంలో మత ఘర్షణలు తలెత్తడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. వినాయకుడి ఊరేగింపు సందర్భంగా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్రభుత్వం అభిప్రాయపడింది. అలాగే నిఘా విభాగం సైతం విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్ఐ అశోక్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే నిఘా విభాగానికి చెందిన ఉన్నతాధికారి శరత్ చంద్రని బదిలీ చేసింది. అతడి స్థానంలో కొత్తగా హేమంత్ నింబాల్కర్‌ను నియమించింది. మరోవైపు నాగమంగళ పట్టణంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా భారీగా పోలీసులను మోహరించారు. మరోవైపు ప్రస్తుతం పట్టణ పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని జిల్లా ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. బుధవారం నాగమంగళ పట్టణంలో.. వినాయకుడి ఊరేగింపు జరుగుతుంది. ఈ ఊరేగింపు మసీద్ సమీపంలోకి వచ్చింది. అకస్మాత్తుగా ఈ ఊరేగింపుపై కొందరు వ్యక్తులు రాళ్ల దాడికి దిగారు. దీంతో



రెండు వర్గాల మధ్య తొపులాట జరిగింది. అనంతరం తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట వినాయకుడి విగ్రహాన్ని నిలిపి ఓ వర్గం ఆందోళనకు దిగింది. అదే సమయంలో పలువురు ఆందోళనకారులు షాపులతోపాటు రహదారిపై వాహనాలకు నిప్పు పెట్టారు. దాంతో 52 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారి బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. తమ వాళ్లు అమయాకులన్నారు. వాళ్లను కారణం లేకుండా అదుపులోకి తీసుకున్నారని వారి బంధువులు ఆరోపించారు. అలాగే ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల అదుపులో ఉన్న వారి సంఖ్య 55కి పెరిగింది. వారందరికి 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు నాగమంగళ పట్టణంలో మత ఘర్షణలపై స్థానిక ఎంపీ, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి జేడీ కుమార స్వామి స్పందించారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ సందర్భంగా ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతి భద్రత పరిస్థితికి ఈ ఘటన అద్దం పడుతుందనేందుకు ఈ ఘటనే సాక్ష్యమని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. శుక్రవారం నాగమంగళలో మంత్రి జేడీ కుమార స్వామి పర్యటించారు. ప్రశాంతంగా వినాయకుడి ఊరేగింపు వెళ్తుండా.. ఈ రాళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని ఈ సందర్భంగా ఆయన సందేహం వ్యక్తం చేశారు. నవరాత్రులు సందర్భంగా బదరికొప్పలు గ్రామం నుంచి వినాయకుడిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్నారు. ఆ క్రమంలో నాగమంగళ పట్టణంలోని మసీద్ వద్దకు రాగానే ఈ ఊరేగింపుపై ఓ వర్గం రాళ్ల దాడికి దిగిన సంగతి తెలిసిందే.

# అట్లాంటా బతుకమ్మ,దసరా ఉత్సవాలకు బిగ్ బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌కు ఆహ్వానం..

**(శుభ తెలంగాణ/హైదరాబాద్) :** బిగ్ బాస్ 2023 విజేత పల్లవి ప్రశాంత్‌ను అమెరికా అట్లాంటా తెలుగు అసోసియేషన్ బతుకమ్మ,దసరా ఉత్సవాలకు ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆయనకు కోర్టు అనుమతులు,పాస్‌పోర్ట్ అందించడంలో ప్రముఖ క్రిమినల్ లాయర్ జక్కుల లక్ష్మణ్ మరియు న్యాయవాది డా.ఆర్.వినోద్ కుమార్ కీలక పాత్ర పోషించారు.పల్లవి ప్రశాంత్ 2023లో బిగ్ బాస్ విజేతగా నిలిచిన అనంతరం,జూబ్లీహిల్స్ పోలీసులు పల్లవి ప్రశాంత్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో పల్లవి ప్రశాంత్ బెయిల్ పొందడానికి,కేసు వ్యవహారాలు నిర్వహించడానికి లీగల్ సపోర్ట్ అందించిన లాయర్ జక్కుల లక్ష్మణ్ మరియు డా.వినోద్ కుమార్,లు ఇప్పుడు కూడా అట్లాంటా వెళ్లేందుకు అవసరమైన, అనుమతులు పొందడంలో సహాయం చేశారు.శుక్రవారం నాంపల్లి కోర్టు వద్ద మీడియా సమక్షంలో పల్లవి ప్రశాంత్ మాట్లాడుతూ,"అమెరికా వెళ్లేందుకు పాస్‌పోర్ట్ కోసం,కోర్టు అనుమతులను త్వరితగతిన పొందడంలో నన్ను సపోర్ట్ చేసిన జక్కుల లక్ష్మణ్,వినోద్ లకు నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను"అని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనకు పాస్‌పోర్ట్ అందించడమే కాకుండా, అక్టోబర్ 5న అట్లాంటా ఉత్సవాలకు హాజరయ్యేందుకు నాంపల్లి కోర్టు నుండి పాస్‌పోర్ట్ అనుమతులు ఇప్పించినట్లు వివరించారు.ఈ సందర్భంగా న్యాయవాదులు పల్లవి ప్రశాంత్‌ను అభినందించారు,ఆయనను ఉత్సవాలకు వెళ్లేలా చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



## రాహుల్ వ్యాఖ్యలు ఆందోళనకరం




కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు భారత్ గురించి చెడుగా మాట్లాడటం అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ఆరోపించారు. ఈసీ వంటి భారత రాజ్యాంగ వ్యవస్థలను కూడా ఆయన తూలనాడుతుంటారని అన్నారు. కేంద్ర మంత్రి శుక్రవారం రాజస్థాన్‌లోని దౌసాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరగని పక్షంలో విపక్షాలకు అన్ని సీట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. బీజేపీ రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజల్లో రాహుల్ గాంధీ గందరగోళం సృష్టించారని దుయ్యబట్టారు. అసలు రిజర్వేషన్లను తొలగించాలనే ఆలోచన రాహుల్ గాంధీ మెదడులో ఉందనే విషయం ఇప్పుడు వెల్లడైందని మంత్రి పేర్కొన్నారు. కాగా, రిజర్వేషన్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తప్పుపట్టారు. తేజస్వి బెంగళూర్‌లో శుక్రవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రిజర్వేషన్ల తొలగింపుపై రాహుల్ వ్యాఖ్యలు ఆందోళనకరమని చెప్పారు. రాహుల్ గాంధీ ఎవరెవరితో సమావేశమవుతున్నారో చూస్తే విస్మయం కలుగుతుందని అన్నారు. భారత్ వ్యతిరేకి ఇల్హర్ ఒమర్‌తో రాహుల్ భేటీ అయ్యారని, ఖలిస్తాన్, పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ ఏజెంట్లతో ఆయన సమావేశాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. రాహుల్ గాంధీ ఓరోజు ఉగ్రవాదులతో సమావేశమైనా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో కేంద్ర ప్రభుత్వం సహా బీజేపీ, ఆరెస్సెస్ లక్ష్యంగా విమర్శలు గుప్పించడం పట్ల కాషాయ నేతలు భగ్గుమన్నారు. విదేశీ గడ్డపై దేశాన్ని అవమానించడం రాహుల్‌కు అలవాటుగా మారిందని మండిపడుతున్నారు. ఇక రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ దినేష్ శర్మ స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భారత్ ఎకానమీ ప్రపంచంలో 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ ఎకానమీగా ఎదిగిందని అన్నారు.

## రాష్ట్రపతి జోక్యం కోరుతూ జూనియర్ వైద్యులు లేఖ




**కోల్‌కతా:** ఆర్జీ కర్ ఆస్పత్రి ట్రయినీ వైద్యురాలిపై హత్యాచారం విషయంలో న్యాయం కోరుతూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనలతో తలెత్తిన ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. దీనికి తెరదించేందుకు జోక్యం చేసుకోవాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జూనియర్ వైద్యులు శుక్రవారంనాడు లేఖ రాశారు. నేర తీవ్రత, దానిని కప్పిపుచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలు, పని ప్రాంతాల్లో భయాలు నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో యావద్దేశం నిష్పాక్షికమైన సత్వర విచారణను కోరుతోందని వైద్యులు తమ లేఖలో రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. ప్రజలు సమష్టిగా తమ భావోద్వేగాలను వెల్లడించేందుకు, బాధితురాలికి సంఘీభావం తెలిపేందుకు, న్యాయం కోరుతూ ఆగస్టు 15వ తేదీన నగరాలు, పట్టాణాలు, గ్రామాల్లో సైతం క్యాండిల్ లైట్ మార్చ్ నిర్వహించారని వివరించారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కొందరు అల్లరిమూక ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలోకి చొరబడి క్యాంపస్‌పై దాడి చేసి ఎమర్జెన్సీ వార్డును ధ్వంసం చేశారని, ఘటన జరిగిన ప్రాంతంలో సాక్ష్యాలు తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందని, ఇంత జరుగుతున్నా పోలీసులు మౌన ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారని, గూండాల భయానికి వైద్యులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పరుగులు పెట్టారని రాష్ట్రపతి దృష్టికి తెచ్చారు. "ఇలాంటి భయానక, నమ్మకం కోల్పోయిన, నిస్సహాయ స్థితిలో జూనియర్ వైద్యులు గత్యంతరం లేని పరిస్థితిలో ఆసుపత్రి ఆవరణలో పనులకు దూరంగా ఉన్నారు. ఇందుకు ప్రతిగా పౌరులకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. అభయ క్లినిక్స్ పేరుతో పబ్లిక్ గ్రౌండ్స్‌లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ వైద్యశిబిరాలను డబ్ల్యూబీజేడీఎఫ్ నిర్వహిస్తోంది. ఉచితంగా హెల్త్ కేర్ సేవలను కొనసాగిస్తోంది. న్యాయం-వైద్యం సమ్మెకు వెళ్లకూడదంటూ భారత ప్రధాన న్యాయమూర్తి మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఎన్ని అవరోధాలు ఎదురైనా విధి నిర్వహణను వైద్యులు కొనసాగిస్తున్నారు" అని ఆ లేఖలో జూనియర్ వైద్యులు పేర్కొన్నారు.

**తాజా నివేదకకు సుప్రీం ఆదేశం**

ఆర్జీ కర్ ఆసుపత్రిలో ట్రయినీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో దర్యాప్తునకు సంబంధించిన తాజా నివేదికను సెప్టెబర్ 17వ తేదీన తమకు సమర్పించాలని సీబీఐని సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించింది. ఆర్జీ కర్ ఆసుపత్రి వద్ద నియమించిన మూడు సీఐఎస్ఎఫ్ కంపెనీలకు వసతి కల్పించాలని కూడా పశ్చిమబెంగాల్ హెూం శాఖ సీనియర్ అధికారులు, సీనియర్ సీఐఎస్ఎఫ్ అధికారిని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

## మిథిలాంచల్‌కు ఎన్డీయే మొండిచేయి తేజస్వి యాదవ్




బిహార్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం కొలువుతీరినా వీరు మిథిలాంచల్ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఆరోపించారు. బిహార్‌లో తమ ప్రభుత్వం ఏర్పాటైతే తాము మిథిలాంచల్ అభివృద్ధి సంస్థను నెలకొల్పుతామని ఆయన హామీ ఇచ్చారు. మిథిలాంచల్ సర్వతోముఖాభివృద్ధికి ఈ సంస్థ పాటుపడుతుందని చెప్పారు. మరోవైపు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని తేజస్వి యాదవ్ స్వాగతించారు. ఇక అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ స్వాగతించారు. ఎంతటి నియంతృత్వమైనా ఒకనాటికి సమసిపోక తప్పదని బీజేపీపై ఆయన విరుచుకుపడ్డారు. కేజ్రీవాల్ ఇప్పుడు జైలు నుంచి బయటకు రానున్నారని, ఈరోజు కోసం వేచిచూసిన వారందరికీ అభినందనలు తెలియచేస్తున్నానని, ఇవాళ ప్రజలంతా పండగ జరుపుకుంటారని గోపాల్ రాయ్ పేర్కొన్నారు. నియంతృత్వ పోకడలు ఎంతటి స్థాయిలో ఉన్నా ఏదోఒక రోజు వాటికి చెల్లుచీటీ తప్పదని ఇవాళ ఢిల్లీ సహా, దేశమంతటికీ ఈ తీర్పు ఓ సందేశం పంపిందని ఆయన వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్‌పై పన్నిన కుట్రలన్నీ ఇప్పుడు విఫలమయ్యాయని, కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే భారీ వేడుకలు నిర్వహిస్తామని ఆప్ ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడం ఆప్‌నకు భారీ విజయమని అభివర్ణించారు. బీజేపీ రూపొందించిన నకిలీ స్కామ్ ఇప్పుడు బట్టబయలైందని అన్నారు.ఖ

# ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

-మొదటిపేజీ తరువాయి

నివేదిస్తామన్నారు. వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని సీఎం కోరారు.

**బాధితులకు ఇళ్ల కోసం నిధులివ్వాలి**

వరదల వల్ల రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని కేంద్ర బృందాలకు రేవంత్ వివరించారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయడంతో రైతులు కోలుకోలేనంత నష్టపోయారని పేర్కొన్నారు. చాలా చోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువులు కొట్టుకుపోవడంతో నష్టం ప్రాథమిక అంచనాలకు మించిపోయిందని వివరించారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే శాశ్వత పరిష్కారం అని స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలని అధికారులను కోరారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తనవంతు వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజలను సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లను కేటాయిస్తామని.. నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని కేంద్రం అందించాలని కోరారు.

**మేడారం అడవులకూ నష్టం**

వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించాక ఆదుకోవడం కన్నా ముందస్తు చర్యలతో నివారణ మార్గాలపై ఎక్కువ దృష్టిసారించాలని కేంద్ర బృందాలకు సీఎం సూచించారు. వర్షపాతం, వడగాలులు,, పర్యావరణ విపత్తులపై ముందస్తు సమాచారం, హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లు ఉండాలని, వాటిపై దృష్టిసారించాలని కేంద్ర బృందానికి సూచించారు. భవిష్యత్తులో వరదలు వచ్చినప్పుడు ఆదుకునేందుకు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న పోలీసు బెటాలియన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఉపయోగించుకోవాలనే ఆలోచనను కేంద్ర బృందంతో సీఎం పంచుకున్నారు. మేడారం అటవీ ప్రాంతంలో వర్షాల కారణంగా 50 ఎకరాల్లో చెట్లు నేలమట్టం అవడంపైనా సమావేశంలో చర్చించారు. దేశంలో ఇప్పటి వరకు వర్షాలకు అడవుల్లో ఇలాంటి ఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం అభిప్రాయపడింది. దీనిపై కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని సీఎం కోరారు. కేంద్రం నుంచి వచ్చిన అధికారుల బృందం రెండు బృందాలుగా విడిపోయి ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించింది. ఎన్‌డీఎంఏ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ సారథ్యంలోని బృందాల్లో శాంతినాథ్, వివప్ప, మహేశ్ కుమార్, నాయల్‌కాన్సర్, రాకేశ్ మీనా, శశివర్ధన్ రెడ్డి ఉన్నారు. సమావేశంలో సీఎంతోపాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సంయుక్త కార్యదర్శి హరీశ్ ,ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీని తలపించేలా కాంగ్రెస్ పాలన..

-మొదటిపేజీ తరువాయి

ఇంటి మీద దాడి చేయించారని హరీశ్‌రావు తెలిపారు. డీజీపీ అనేది అత్యున్నత స్థాయి, గౌరవప్రదమైన పోస్టు అని, ఈ పదవిలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రేవంత్ రెడ్డి గురించి తెలిసిందేనని... గతంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేయడానికి వెళితే పోలీసులను తిట్టారని ఆరోపించారు.

**ఎవరి మీద దాడులు చేయాలని రివ్యూలు చేస్తారా..?**

నిన్న లా అండ్ ఆర్డర్ ఏమైంది నిన్న గాంధీని ఆపొచ్చు కదా..? నిన్న ఆయనను ఆపి ఉంటే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినేదా..? మరి ఎనిమిది పోలీసు స్టేషన్లు దాటించి, కౌశిక్ రెడ్డి ఇంటి లోపలికి పంపించి దాడి చేయించారు. మరి నిన్న ఎందుకు యాక్ట్ చేయలేదు. దీనికి కారణం సీఎం, డీజీపీ కాదా..? ఇప్పుడేమో సీఎం, డీజీపీ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఎవరి మీద దాడులు చేయాలని రివ్యూలు చేస్తారా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారాయని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం పోలీసులకు సహకరిస్తున్నారని తెలిపారు. కాబట్టి రేవంత్ రెడ్డి మాటలను అనుసరించవద్దని కోరారు. తప్పు చేయాలని రేవంత్ చెప్పినా చట్టబద్ధంగా వ్యవహరించాలని హితవు పలికారు. నిన్న అరికెపూడి గాంధీని ఆపకుండా... ఈ రోజు తమను ఆపడం ఏమిటని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి ఇంటికి పంపించి దాడి చేయించినప్పుడు లా అండ్ ఆర్డర్ ఏమైందో చెప్పాలన్నారు.


రేవంత్ రెడ్డి విసిరే ప్రతి రాయి తమకు పునాదిరాయిగా మారుతుందన్నారు. రాళ్ల దాడులకు భయపడతామని అనుకుంటే పొరపాటు అన్నారు. పోరాటాలు తమకు కొత్తేమీ కాదన్నారు. తెలంగాణ గురించి బాధ్యతగా ఆలోచిస్తామన్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి అన్నీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఒక సమస్య నుంచి తప్పించుకోవడానికి మరో సమస్యను సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీకి రాజకీయం కంటే రాష్ట్రం ముఖ్యమన్నారు.

**రాళ్ల దాడి చేసిన వారికి రాచమర్యాదలు..**

నిన్న రాళ్ల దాడి చేసిన వారికి రాచమర్యాదలు చేశారు. పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి బిర్యానీలు, సమోసాలు తినిపించి, ఆ తర్వాత ఎస్కార్ట్ ఇచ్చి ఇంటింకి పంపించారు. కౌశిక్ రెడ్డి మీద దాడి విషయంపై మేం ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. అరెస్టు చేసి 2 గంటలు హైదరాబాద్‌లో తిప్పి అర్ధరాత్రి మహబూబ్‌నగర్ జంగిల్‌లో విడిచిపెట్టారు. ఇదేనా పోలీసులు ప్రవర్తించే తీరు.. రాష్ట్రంలో లా అండర్ ఆర్డర్ ఉందా..? అని నిలదీశారు హరీశ్‌రావు.

**ఆ గూండాలను అరెస్టు చేయలేదు..**

వరద బాధితులను పరామర్శించేందుకు బీఆర్ఎస్ నేతలు వెళ్తే.. ఖమ్మంలో రాళ్ల దాడి చేశారు. పది రోజులైనా దానిపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు.. ఆ గూండాలను అరెస్టు చేయలేదు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లగొండ వెళ్తే.. బస్సుల మీద కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేశారు. సిద్దిపేటలో నా క్యాంపు కార్యాలయం మీద దాడి చేశారు. ఈ ఘటనల్లో ఏ ఒక్క విషయంలో కూడా పోలీసులు యాక్ట్ చేయలేదు. అరెస్టులు చేయలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.



**సీఎం నోరు అదుపులో పెట్టుకోవాలి..**

ఈ రాష్ట్ర ముఖ్యమంత్రే రెచ్చగొడుతున్నారు. సీఎం నోరు అదుపులో పెట్టుకోవాలి. ఆయన మాట్లాడే భాష బజారు భాష. పేగులు తీసి మెడలు వేసుకుంటా.. లాగుల్లోకి తొండలు జొరగడుతా.. అని రెచ్చగొట్టేలా రేవంత్ రెడ్డినే మాట్లాడుతున్నారు. రేవంత్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు అనుసరిస్తున్నారు. దానం నాగేందర్, అరికెపూడి గాంధీ కూడా అలానే పని చేస్తారు. పదేండ్లు కేసీఆర్ నాయకత్వంలో వీరిద్దరూ రౌడీల్లా ప్రవర్తించలేదు. రేవంత్ భాష, విధానం వల్ల నాయకులు కూడా అలానే తయారవుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**గాంధీని అరెస్టు చేసి ఉంటే ఇది జరిగేదా..?**

మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తే కొట్టండి అని కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. లా అండ్ ఆర్డర్ ఎక్కడుంది..? మొదట నీవు రివ్యూ చేసుకో.. మంత్రులను రివ్యూ చేసుకో. ఇవాళ మమ్మల్ని హౌస్ అరెస్టు చేశారు. అదే నిన్న గాంధీని అరెస్టు చేసి ఉంటే ఇది జరిగేదా..? హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను హౌస్ అరెస్టు చేశారు. రేవంత్ వైఖరేంటో ఈ రాష్ట్ర ప్రజలకు అర్థమవుతుంది. ఈ దాడుల కుట్రంతా రేవంత్ రెడ్డి ఎజెండా.. గాంధీ చేసిన దాడిగా పరిగణించడం లేదు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఈ రకమైన నిర్బంధాలు, అణిచివేతలు చూడలేదు. రేవంత్ పాలలో ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా..**
**ప్రభుత్వానికి హరీశ్ రావు సూటి ప్రశ్న**

పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్ఎస్ పాలన సాగిందని.. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోందని.. శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పడానికి సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శలు గుప్పించారు.

"శాంతి భద్రతలు అదుపు తప్పడానికి చేసిందంతా చేసి భాగ్యనగరం బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి దాడులు చేయించింది ఎవరు ..? రేవంత్ రెడ్డి, డీజీపీలు కాదా ..? నిన్నటి దాడులు ఎందుకు ఆపలేదు. అది గాంధీ చేసిన దాడి కాదు రేవంత్ రెడ్డి చేసిన దాడి. మమ్మల్ని ఇవాళ హౌజ్ అరెస్ట్ చేశారు. నిన్న గాంధీని ఎందుకు హౌజ్ అరెస్టు చేయలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా. ఖమ్మంలో మా మీద దాడి చేస్తే పది రోజులైనా గుండాల మీద కేసులు పెట్టలేదు. నిన్న జరిగిన దాడికి కర్త,కర్మ, క్రియ అంతా రేవంత్ రెడ్డే. ఆయన డైరెక్షన్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగింది.

ఎమర్జెన్సీ కన్నా దారుణంగా రాష్ట్ర పరిస్థితులు తయారయ్యాయి.కోమటి రెడ్డి వెంకటరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టాలని చెప్పడం దారుణం. ఫిరాయింపులపై ఢిల్లీలో ఒక మాట గల్లీలో ఒక మాట మాట్లాడుతున్నాడు. ఎన్నిక లేకున్నా పీఏసీ చైర్మన్ ను నియమించి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం దుర్మార్గం. డీజీపీ పదవి చాలా ఉన్నతమైంది. ఆదర్శంగా ఉండాల్సిన డీజీపీ.. రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడాలనుకుంటున్నారు. రాహుల్ గాంధీ దేశం బయట స్వేచ్ఛ స్వాతంత్ర్యాల గురించి పాఠాలు చెప్పడం కాదు. తెలంగాణలో ఏం జరుగుతుందో చూడాలి.

రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించి పార్టీ ఫిరాయింపులు జరిగాయి. పీఏసీ చైర్మన్ నియామకం కూడా అలాగే జరిగింది. మీరు మాపై విసిరే రాళ్లే అధికారంలోకి బీఆర్ఎస్ రావడానికి పునాది రాళ్లు. 16వ ఆర్థిక సంఘం గురించి మీరు తప్పుడు లెక్కలు చెబితే, మేము బాధ్యతాయుతంగా బలమైన వాదనను వినిపించాం. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ రెడ్డి కపట ప్రేమ వలకబోస్తున్నారు. చిన్న జీయర్ స్వామిని, యాదాద్రి నిర్మాణానికి ప్లాన్ ఇచ్చిన ఆనంద సాయిని ఆంధ్రోడు అని రేవంత్ అన్నారు. మరి దానికి ఏమని సమాధానం చెబుతారు.

పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా ఇది జరిగింది. కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో నీ పెత్తనం ఏంటని అరికెపూడి గాంధీ.. కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. దానికి సమాధానంగానే కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్పా? సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదు. ముందు రెచ్చగొట్టింది గాంధీ. ఆయనకు చెప్పిన సమాధానం అది"అని హరీశ్ రావు తెలిపారు. గురువారం జరిగిన తొక్కిసలాటతో తనకు భుజం నొప్పి మొదలైందని.. డాక్టర్లు ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ సూచించారని హరీశ్ వివరించారు.

## గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు



హైదరాబాద్ : గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో గణేష్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

**నిబంధనలు ఇవే..**

గణేష్ నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం కీలక నిబంధనలు ప్రకటించారు. నిమజ్జనం రోజున పాటించాల్సిన ముందస్తు నియమాలను వెల్లడించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని, వాహనానికి ఏసీపీ కేటాయించిన నంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ సిటీ పోలీసులు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు.

## తెలుగు ప్రజలకు వినాయక చవితి కానుక.. కొత్తగా రెండు వందేభారత్ రైళ్లు



వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తెలుగు ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ కానుక అందించారు. ఈ నెల 16న మోదీ రెండు తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్‌పూర్ -హైదరాబాద్, దుర్గ్ %-% విశాఖపట్నం మధ్య ఈ వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలియజేశారు. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత ఉందని కిషన్ రెడ్డి అన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రధాని మోదీ ఆపన్న హస్తం అందించారని తెలిపారు. '70 ఏళ్లు దాటిన వారందరికీ రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించారు. పేద, ధనిక తేడా లేకుండా ఆరు కోట్ల మంది వయోవృద్ధులకు లబ్ధి చేకూరనుంది. వచ్చే రెండేళ్లలో ఈ పథకంపై రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ధి జరగనుంది. 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులందరికీ ఈ పథకం కోసం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే ఆయుష్మాన్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5 లక్షల టాప్-అప్ కవర్ ఇవ్వనుంది. వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ట్రిబ్యునల్ అవసరమే లేదు

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తావించింది. దీనిపై ఏపీ ప్రభుత్వం తాజాగా కౌంటర్ రిజాయిండర్‌ను సమర్పించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ద్వారానే రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో మళ్లీ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం సరికాదని, సెక్షన్ 3 ద్వారా నూతనంగా ఇచ్చిన మార్గదర్శకాలు న్యాయవిరుద్ధమని తెలిపింది.

## వయోవృద్ధులకు మోదీ ఆపన్నహస్తం

-మొదటిపేజీ తరువాయి

రూ.3,437 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుందన్నారు. దీంతో తెలంగాణ నుంచి మరో 10 లక్షలమంది వయోవృద్ధులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. 70 ఏళ్లు దాటిన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేక గుర్తింపులు కార్డులు ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5 లక్షల టాప్ అప్ కవర్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు ప్రధాని మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 16న మరో రెండు కొత్త వందేభారత్ రైళ్లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాగపూర్-హైదరాబాద్, దుర్గ్-విశాఖ మధ్య రెండు వందేభారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నట్లు చెప్పారు. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచి అత్యధిక వందేభారత్ రైళ్లు నడుస్తున్నట్లు చెప్పారు.

## త్వరలో ట్రాన్స్‌జెండర్లకు కొత్త బాధ్యతలు..



-మొదటిపేజీ తరువాయి

వినూత్న ఆలోచన ఇప్పుడు హాట్ టాపిక్‌గా ఇంట్రెస్టింగ్‌గా మారింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీని వాలంటీర్లుగా వినియోగించేందుకు పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ ఆలోచన ద్వారా ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారికి సమాజంలో గౌరవం తీసుకురావడమే కాకుండా, నగర ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో కూడా ఒక కొత్త మార్గం చూపించినట్లు అవుతుందని భావిస్తున్నారు సీఎం రేవంత్. హోమ్ గార్డ్స్ తరహాలో వారికి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కూడా అధికారులను సీఎం సూచించారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్ పాత్ ల అభివృద్ధి, శుభ్రత, ఇతర కీలక పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా, టెండర్ల ద్వారా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ల పనితీరుపై ఆయన నిశితంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లను ఏమాత్రం ఉపేక్షించరాదని సీఎం ఆదేశించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్ల అభివృద్ధి, ఫుట్ పాత్ నిర్మాణాలు, ఇతర పనులను గడువులోపు పూర్తిచేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. అలాగే, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్లపై పూర్తి స్థాయి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

తప్పుడు నివేదికలు సమర్పించిన అధికారులపై చర్యలు తప్పవని సీఎం రేవంత్ హెచ్చరించారు. నగరంలో అనేక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చర్యలు జరుగుతుండగా, అవి సమయానికి పూర్తవ్వడం కోసం తగిన క్రమశిక్షణతో పని చేయాలని సీఎం ప్రత్యేకంగా ఆదేశించారు. ఇక ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి ట్రాఫిక్ స్ట్రీమ్‌లైన్ చేయడంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీని వాలంటీర్లుగా వినియోగించేందుకు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వాలంటీర్లుగా పనిచేసే ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని సీఎం అభిప్రాయపడ్డారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హోమ్ గార్డ్స్ తరహా ఉద్యోగాలను పరిగణలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఆసక్తి ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించి, తగిన విధానాలు రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి సూచించిన ఈ కొత్త ఆలోచన ఒకవైపు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి సమాన అవకాశాలు కల్పిస్తుండగా, మరోవైపు నగర ట్రాఫిక్ సమస్యలపై ఒక పరిష్కార మార్గాన్ని అందిస్తుందని భావిస్తున్నారు.

## వరద నష్టంపై కేంద్ర బృందానికి వివరించిన సీఎస్

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం బుధవారం రాష్ట్రానికి చేరుకుంది. ప్రభావిత ప్రాంతాల్లో సంభవించిన వరద నష్టంపై కేంద్ర బృందానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నివేదించారు. కర్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం సీఎస్, ప్రభుత్వ సీనియర్ అధికారులతో చర్చలు జరిపింది. అతి తక్కువ సమయంలో వాతావరణ శాఖ అందించిన హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవడంతో ప్రాణనష్టం తగ్గించగలిగామని సీఎస్ చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు పరిస్థితిని సమీక్షించి, వరద, పునరావాస, సహాయక చర్యలను పర్యవేక్షించారని సీఎస్ చెప్పారు. సహాయక చర్యలు చేపట్టేందుకు డిప్యూటీ సీఎంతో పాటు మరో ఇద్దరు రాష్ట్రమంత్రులు హుటాహుటిన ఖమ్మం చేరుకొని సహాయక కార్యక్రమాలను వేగవంతం చేశారని, ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగానికి వరద సహాయం, పునరావాస కార్యక్రమాలకు సంబంధించి నిధులు వెంటనే విడుదల చేశామని సీఎస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలను అందించడానికి వీలుగా మార్గదర్శకాలను రూపొందించాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్‌తో సమానంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. ప్రత్యేక బృందాలకు శిక్షణ, ఇతర లాజిస్టిక్స్ ఏర్పాట్లలో ఎన్‌డీఎంఏ మద్దతు కావాలని కోరారు. భారీ వర్షాల సమయంలో ఎయిర్ రెస్క్యూ ఆపరేషన్‌ల సమస్యను సీఎస్ ప్రస్తావించారు. సవాళ్లు ఎదుర్కోవడంలో కేంద్రం సహకారాన్ని కోరారు. ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో 332 హెక్టార్ల విస్తీర్ణంలో భారీ చెట్లు కూలిన సంఘటనలను, పర్యావరణ విపత్తు సమస్యను ప్రస్తావించారు. విపత్తుకు మూల కారణాలు తెలుసుకునేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని కేంద్ర బృందం సీఎస్‌కు సూచించింది. విపత్తు నిర్వహణశాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ వరదల కారణంగా సంభవించిన నష్టాలను, ఆపదలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం అందించడానికి ప్రభుత్వం చేసిన కృషిని కేంద్ర బృందానికి వివరించారు. వరద నష్టం ప్రాథమిక అంచనాలు రూ.5,438 కోట్లుగా ఉన్నాయని, పూర్తిస్థాయి అంచనా ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని చెప్పారు.

# పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**కరీంనగర్, శుభ తెలంగాణ :** గణేష్ నిమజ్జనోత్సవం... మిలాద్ ఉన్ నబి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనం మిలాద్ ఉల్ నబీ పండుగల నేపథ్యంలో శాంతి కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమన్వయ సమావేశం నిర్వహిం చారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శు క్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అధికారులకు, పోలీసులకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. పండుగల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయా లని ఆదేశించారు. ఎలాంటి అపశ్రుతులు తావులేకుండా ఆనందోత్సాహాల నడుమ భక్తి శ్రద్ధలతో నిమజ్జనోత్సవం మిలాద్ ఉన్ నబి వేడుకలు ను జరుపుకోవాలని కోరారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దని, పరస్పర సహకారంతో గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. నిమజ్జన ఉత్సవం సాఫీగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ మేరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి అని అన్నారు. శాంతి కమిటీ సభ్యులు పరస్పరం సహకరించుకోవడం అభినందించ దగ్గ విషయం అన్నారు.

ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పరస్పర సహకారంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, అధికారులకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపుల్ దేశయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్,ట్రైని కలెక్టర్ అజయ్ యాదవ్, డి ఆర్ డి ఓ, పవన్ కుమార్ ఆర్డీవో మహేశ్వర్, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిమజ్జనం ప్రశాంతంగా జరుగాలి

**ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి..**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి, శుభ తెలంగాణ :** ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం లోని రాజరాజేశ్వర వసతి గృహం లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కిరణ్ కరే తో కలసి రెవెన్యూ, పోలీస్ పంచాయితీ, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, మత్స్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి, కమిటీ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో కాళేశ్వరం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జనానికి భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల నుండి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ మైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు యంత్రాంగం సూచనలు పాటించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు పర్యవేక్షణకు అధికారులకు విధులు కేటాయించామని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జనం చేయడానికి రెండు పాయింట్లు అలాగే రెండు క్రేన్ లు ఏర్పాటు చేయడం జరిగిందని క్రేన్స్ ద్వారానే విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు జిల్లా యంత్రాగం నిర్దేశించిన ప్రదేశం వరకే అనుమతి ఉంటుందని భక్తులు సహకరించాలని సూచించారు. నిరంతర పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. పంచాయితీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా భక్తులకు త్రాగునీరు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఏదేని సమస్య వచ్చినా విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నయ ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మేఘా సంస్థ ద్వారా రెండు జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గజ ఈత గాళ్ళు లైఫ్ జాకెట్లు ధరించి సిద్ధంగా ఉండాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రహదారులపై గుంతలు ఎర్పడ్డాయని మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని తెలిపారు. మరుగుదొడ్లు గుర్తించే విధంగా సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఏదేని సమస్య వస్తే అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. 9 రోజుల పాటు నైవేద్యాలు అందుకున్న వినాయకుడు గంగమ్మ వడికి చేరుతున్నాడని ఎలాంటి అపశ్రుతులకు అవకాశం లేకుండా భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిమజ్జనోత్సవం జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఏర్పాట్లు పర్యవేక్షణ కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజులు మద్యం విక్రయాలు నిలిపివేయాలని సూచించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర కొనసాగే మార్గాలలో పటిష్ఠ మైన నిఘా ఉంటుందని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. భూపాలపల్లి, కాటారం, మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని, 24 గంటలు పనిచేయు విధంగా అత్యవసర చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారంలో ఎమ్మెల్యే పర్యటన

**ఖమ్మం, శుభ తెలంగాణ :** సింగరేణి బాధితులకు న్యాయం జరగకపోతే సింగరేణి యాజమాన్యంతో పోరాటానికైన సిద్ధమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మండలం - కిష్టారం ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల వల్ల గ్రామం కాలనీల్లో సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితుల ఇళ్ళను ఎమ్మెల్యే పరిశీలించి,వారితో మాట్లాడారు.బాంబ్ బ్లాస్టింగ్ శబ్దాలతో పగిలిపోయిన ఇల్లులో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుతున్న కిష్టారం ప్రజలకు వర్షాలు శాపంగా మారాయన్నారు. బాంబ్ శబ్దాలకు ఇల్లు పై కప్పు లు, ఇంటి గోడలు కూలిపోవటంతో పాటు కిష్టారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో " పునరావాస " కేంద్రం ఏర్పాటు చేశారన్నారు.పునరావాస కేంద్రాల్లో ఉంటున్న కిష్టారం నిరాశ్రయులను సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ... సింగరేణి బాంబు బ్లాస్టింగ్ ల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని... లేకుంటే సింగరేణితో కొట్లాడేందుకు సిద్ధమని అన్నారు.

## ఆర్టీసీ బస్ స్టాండ్ ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**మిర్యాలగూడ, శుభ తెలంగాణ :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాలినడకన ఆర్టీసీ బస్టాండ్ ను ఆకస్మిక తనిఖీ చేసారు. బస్టాండ్ ఆవరణములో సానిటైజేషన్ , మరుగుదొడ్లు సరిగా లేవని కాంట్రాక్టర్ పై మండిపడ్డారు. తక్షణమే బస్టాండ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్ కు ఆదేశాలు ఇచ్చారు. ప్రయాణికుల భద్రత పరిశు భ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ముంపు బాధిత విద్యార్థులకు యస్‌బీఐటి ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ




**ఖమ్మం, శుభ తెలంగాణ :** గత వారం ఖమ్మం ను ముంచెత్తిన వరదలతో సర్వం కోల్పోయిన విద్యార్థులకు తమ వంతు గా పుస్తకాలను పంపిణీ చేసినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ప్రకృతి వైపరిత్యాలు విద్యకు ఆటంకం కాకూడదనే సదుద్దేశం తో తమ కళాశాల విద్యార్థుల సహకారంతో స్థానిక సారథి నగర్ లో ని ప్రభుత్వ జూబ్లీ పుర పాఠశాల తో పాటు వేంకటేశ్వర నగర్ లోని పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశామని కృష్ణ తెలిపారు.తమ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాలలో అన్నదానం నిర్వహించామని, తరగతులు మొదలవటంతో అవస్థలు పడుతున్న విద్యార్థులకు అండగా పుస్తకాల పంపిణీ చేపట్టామని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డా॥జి.ధాత్రి తెలిపారు.తామ విద్యార్థులు చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట రామారావు మరియు ఏం. ఈ.ఓ. రాములు తమకు సహకరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పుస్తక పంపిణీకి ముందుకు వచ్చిన కళాశాల విద్యార్థులకు వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా? కె. అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, డా? జె. రవీంద్రబాబు, డా? యన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రిలో శిశువు మృతి డాక్టర్ పై కత్తి దాడి

**పెద్దపల్లి, శుభ తెలంగాణ :** పెద్దపల్లి లోని శ్రీ సిద్ధార్థ ప్రైవేట్ ఆస్పత్రిలో ఏడు నెలల శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని ఆస్పత్రి ఎదుట గురువారం బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యుడి పై కత్తితో దాడి చేసారు. ఆస్పత్రి ఫర్నిచర్ ధ్వంసంఅయింది. ఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సిపి శ్రీనివాసు లకు వైద్యులు వినతి పత్రం ఇచ్చారు. వైద్యుడిపై దాడికి నిరసనగా పెద్దపల్లిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అన్ని ప్రైవేట్ హాస్పటల్ బంద్ కు పిలుపునిచ్చింది. వైద్యులపై దాడి చేసిన పాప తండ్రి ఖాదిర్ పై కేసు నమోదు చేసారు.

## శాంతి భద్రతలతోపాటు వైద్య శిబిరాలు అభినందనీయం..

**ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..**

**రాజన్న సిరిసిల్ల, శుభ తెలంగాణ :** పోలీసుల ఆద్వర్యంలో శాంతి భద్రతల సేవలు అందించడంతో పాటు వైద్య శిబిరాలు అభినందనీయమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కొనియాడారు.రుద్రంగి మండలం మానాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య శాఖ,అశ్విని హాస్పిటల్ రెనే హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రారంభించారు.ఉచిత మెగా వైద్య శిబిరానికి రుద్రంగి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజల నుండి వచ్చిన సుమారు 800 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. మారుమూల గ్రామ ప్రజలకు మేము ఉన్నాం అంటూ భరోసా కల్పిస్తూ వారికి సత్వర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అభినందనియమని కొనియాడారు. గ్రామాలు ఆరోగ్యం ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమని, మారుముల ప్రాంతం మైన మానాల చుట్టూ ప్రక్కల గ్రామాలకు గతంలో ఏదైనా సమస్య తలెత్తుతే ఒకక్కారు ఇద్దరు తప్ప ఎవరు రని పరిస్థితి నుండి ప్రస్తుతం మేము ఉన్నాం అంటూ మానాల చుట్టుపక్కల గ్రామాలు భరోసా జిల్లా అధికార యంత్రాంగం కల్పించిందని వివరించారు.పోలీస్ శాఖ అనగానే శాంతి భద్రతల పరిరక్షణ ఒక్కటే తప్ప ఇతరత్రా సమస్యలు దూరంగా ఉంటుందని అనే ముద్ర నుండి సామాజిక రుగ్మతలు రూపుమముతూ ఏదైనా సమస్యలు తలెత్తుతే మేము ఉన్నాం అంటూ సామాజిక సేవకులు అందిస్తు జిల్లా ప్రజలకు భరోసా కల్పిస్తున్న జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలోని జిల్లా పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మానాల గ్రామంతో చిన్నప్పటి నుండి మంచి అనుబంధం ఉందని, మానాల చుట్టూ ప్రజల సమస్యలు పరిష్కారంలో బాగంగా ఇక్కడ ఉన్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచక్కటి నిర్ణయమని వివరించారు.త్వరలో రుద్రంగి మండల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని,ప్రభుత్వ ఉచిత వైద్యం ,విద్య అనే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేసి వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు.ష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్ మాట్లాడుతూ. మారుమూల ప్రాంతం అయిన మానాల చుట్టూ ప్రక్కల ప్రజల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సదుపాయాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. మెగా ఉచిత వైద్య శిబిరాన్నీ ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంగా ఉండటానికి మద్యపాననికి దూరంగా ఉండాలని, ప్రజలకు రక్తహీనత సమస్యలు ఉన్నాయని వాటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించాలన్నారు. అవసరమైతే కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రికి పంపి ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో మీ కోసం కార్యక్రమంలో భాగంగా మానాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామాల్లో యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, పిల్లల నడవడిక తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, గంజాయి కి అలవాటు పడిన వారిని జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన డి ఆడిక్షన్ సెంటర్ కి పంపించాలని సూచించారు. ఇక్కడ డీఎంహె చ్ఓ వసంతరావు, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ పెంచలయ్య, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎస్ఐలు, డాక్టర్లు ఉన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పోలీసుల బిగ్ షాక్


**హైదరాబాద్, శుభ తెలంగాణ :** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో సవాళ్లు ప్రతిసవాళ్లకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పోలీసులు ఝలక్ ఇచ్చారు. పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్పీ రవి చందన్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేవారు. 132, 351 బి, బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు నమోదు చేశారు. కాగా గత రెండు రోజులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య జెండా జగడం జరుగుతోంది. పార్టీ ఫిరాయింపుల అంశంపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. గాంధీ ఇంటికెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానని కౌశిక్ శపథం చేశారు. అయితే ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అయితే అనూహ్య రీతిలో పాడి కౌశిక్ రెడ్డి విల్లాకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తన అనుచరులను వెంటబెట్టుకొని వెళ్లడం రచ్చకు దారితీసింది. టమాటాలు, కోడిగుడ్లతో దాడి చేశారు. కిటికీలు, కుండీలు ధ్వంసం చేశారు. ప్రతిగా బీఆర్ఎస్ కార్యకర్తలు చెప్పులు విసిరారు. దీంతో గురువారం దాదాపు గంటన్నరపాటు అక్కడి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. గాంధీని పోలీసులు అరెస్టు చేసి ఆ తర్వాత విడుదల చేశారు. ఆ తర్వాత సైబరాబాద్ కమిషనరేట్‌కు హరీశ్, కౌశిక్ తరలించారు. ఈ పరిణామంపై కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది ప్రభుత్వ దాడి అని అభివర్ణించారు. గాంధీ ఇంటిని శుక్రవారం కచ్చితంగా ముట్టడిస్తానని కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏం జరుగుతుందో మీరే చూస్తారు అని శపథం చేశారు. పోలీసుల వైఫల్యం కారణంగా ఇంత రచ్చ జరిగిందని ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాగా కౌశిక్ రెడ్డి ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.

## హైదరాబాద్‌ను నాశనం చేస్తున్నారు

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** పోలీసులు ఎమ్మెల్యేల ఇండ్లచుట్టూ ఉండి హౌస్ అరెస్టు చేయడం మంచిది కాదు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేయడం చాలా దారుణమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రశాంతంగా ఉన్న హైదారాబాద్ ను నాశనం చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరెట్ ఏర్పడిన నాటి నుండి ఇలాంటి సంఘట నలు ఎప్పుడు జరుగలేదు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకో వాలని సీపీ కోసం వెళ్తే ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం కరెక్టేనా. సీపీ కార్యాలయంకు వెళ్లినందుకు పోలీసులు అరెస్టు చేసి 180 కిలోమీటర్లు తిప్పారు. ఇలాంటి అలజడులు సృషిస్తే ప్రజలు చూస్తే ఊరుకోరు. తెలంగాణ రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నాం ఆంధ్ర తెలంగాణ అని ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారు. హైడ్రా పేరుతో ఒకవైపు పేద ప్రజల ఇండ్లను కూల్చడం భయపెట్టడం మరోవైపు ఎమ్మెల్యేల ఇండ్లపై దాడులు చేయడం ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. వినాయక చవితి సమయంలో ఎలాంటి అల్లార్లకు తావులేకుండా పోలీసులు చూసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రశాంత వాతావరణం ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి విధంగా చూడాలని అన్నారు.

## అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి



**పెద్దపల్లి, శుభ తెలంగాణ :** అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే విజయరమణారావుకు మహనీయుల ఆశయ సాధన సంఘం అధ్యక్షులు బొంకురి కైలాసం అందజేశారు. ఈ భవన నిర్మాణం కోసం గత మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రూ.19.50 లక్షల నిధులు మంజూరి చేశారన్నారు. పని నిర్మాణం చేసే సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో నిర్మాణం నిలిచి పోయిందన్నారు. కాగా ఈర్ల సురేందర్ అనే వ్యక్తి ఈ స్థలంలో అంగన్ వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని వార్డు సందర్శనలో మీ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. మళ్ళీ ఈర్ల సురేందర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పనులు మొదలు మొదలుపెట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తనపై వ్యక్తిగతంగా కక్ష పెట్టుకొని అంబేద్కర్ భవనం నిర్మాణం కాకుండా చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆ వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. వెంటనే భవన నిర్మాణ పనులు మొదలు పెట్టాలని లేని యెడల అంబేద్కర్ విగ్రహం ముందు టెంట్ వేసి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు.

## ఈ పండును పాలతో కలిపి తాగి చూడండి.. కీళ్ల నొప్పుల నుండి మూలవ్యాధి వరకు!

భారతదేశంలో మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. అనియంత్రిత మధుమేహంతో మరణిస్తున్న వారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. అలాంటి వారికి, ఇంట్లో తయారుచేసిన మసాలా దినుసులు చాలా సహాయకారిగా ఉంటాయి. మధుమేహాన్ని తగ్గించడంలో ఇది బాగా ఉపయోగపడుతుంది. వాటిలో ప్రధానమైనది జాజికాయ. జాజికాయ చాలా సంవత్సరాలుగా సుగంధ ద్రవ్యంగా ఉపయోగించబడింది. కానీ ఈ జాజికాయ ఆహారానికి రుచిని, వాసనను పెంచడమే కాకుండా ఔషధంగా కూడా ఉపయోగపడుతుంది. ఆయుర్వేదంలో, జాజికాయ అనేక వ్యాధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మధుమేహం వంటి ప్రమాదకరమైన వ్యాధులను నివారించడంలో జాజికాయ చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. నాసిరకం జీవనశైలి కారణంగా మధుమేహంతో బాధపడే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఒక్కసారి మధుమేహం వస్తే దానిని అదుపు చేయడం చాలా కష్టంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో జాజికాయను ఆహారంలో చేర్చుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. జాజికాయను ఎలా ఉపయోగించాలో మరియు మధుమేహాన్ని ఎలా తగ్గించాలో ఇక్కడ ఉంది. జాజికాయ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని అనేక అధ్యయనాలలో తేలింది. జాజికాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నిరోధిస్తుంది. నిజానికి, ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గినప్పుడు, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం ప్రారంభమవుతుంది. జాజికాయ ప్యాంక్రియాటిక్ కణాలను సక్రియం చేస్తుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. వీటితో జాజికాయ తింటే జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. ఇది కాకుండా, జాజికాయలో యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి ఇతర వ్యాధులను నివారిస్తాయి.



ఆయుర్వేదం ప్రకారం జాజికాయను ఉంచండి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు పాలలో చిటికెడు జాజికాయ పొడిని తాగడం ప్రారంభించండి. దీన్ని తాగితే మధుమేహం అదుపులో ఉంటుంది. మరుగుతున్న పాలలో జాజికాయ పొడి వేసి బాగా వేడి చేయాలి. పాలు బాగా మరిగిన తర్వాత జాజికాయ రసాన్ని పాలలో కలుపుతారు. ఇప్పుడు పాలను ఫిల్టర్ చేసి వేడి వేడిగా తాగాలి. జాజికాయ పాలను రోజూ రాత్రిపూట వారం రోజుల పాటు తాగితే రక్తంలో చక్కెర స్థాయిల్లో తేడా కనిపిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, జాజికాయ చక్కెరను నియంత్రించడానికి దివ్యౌషధంగా పనిచేస్తుంది. మధుమేహం కాకుండా, జాజికాయ అనేక వ్యాధులను నయం చేస్తుంది. జాజికాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. మలబద్ధకం, మూలవ్యాధి వంటి వ్యాధులను నివారిస్తుంది. గ్యాస్ మరియు అజీర్ణం నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే స్థూలకాయం సమస్య రాకుండా కాపాడుతుంది. కీళ్లనొప్పుల సమస్య ఉంటే జాజికాయ నూనెలో వేపను కలిపి కీళ్లపై మర్దన చేస్తే మంచి ఉపశమనం లభిస్తుంది.

## ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే

ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం పొందాలంటే ఈ డ్రింక్ తీసుకోవాలి.. ఈ మధ్యకాలంలో ఒత్తిడి అనేది సర్వసాధారణంగా మారిపోయింది. ఇది చిన్న సమస్యగా కనబడుతుంది. కానీ దాన్ని నిర్లక్ష్యం చేస్తే ఎన్నో సమస్యలకు కారణం అవుతుంది. ఒత్తిడి అనేది మన శరీరం మొత్తం మీద ప్రభావాన్ని చూపుతుంది. ఒక రకంగా చెప్పాలంటే ఒత్తిడి ప్రభావం కారణంగా ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయి. అంతేకాక ఒత్తిడి కారణంగా కోపం, బాధ లాంటి నెగటివ్ ఎమోషన్స్ పెరిగి యాంగ్జయిటీ, డిప్రెషన్‌లకు దారితీస్తాయి. శారీరకంగా కూడా ఒత్తిడి ప్రభావం ఉంటుంది. అందుకే ఒత్తిడి ఉన్నప్పుడు వీలైనంత త్వరగా దాని నుంచి బయటపడటానికి ప్రయత్నం చేయాలి. ఒత్తిడి తగ్గించుకోవటానికి ఇంటి చిట్కాలు చాలా బాగా సహాయపడతాయి. మన ఇంటిలో ఉండే సహజసిద్ధమైన



పదార్థాలతో డ్రింక్ తయారుచేసుకొని తాగితే ఒత్తిడి నుండి చాలా తొందరగా ఉపశమనం కలుగుతుంది. ఈ మధ్య కాలంలో మనలో చాలా మంది వయస్సుతో సంబంధం లేకుండా ఒత్తిడికి గురి అవుతున్నారు. ఇప్పుడు చెప్పే డ్రింక్ తీసుకుంటే ఒత్తిడి తగ్గటమే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అర అంగుళం అల్లం ముక్కని తీసుకుని తొక్క తీసి సన్నగా తురుముకొని పక్కన పెట్టుకోవాలి. అర అంగుళం పసుపు కొమ్మును తీసుకుని తొక్క తీసి సన్నగా తురుముకోవాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి గ్లాసు నీటిని పోసి కాస్త వేడి అయ్యాక తురిమిన అల్లం, పసుపు వేయాలి. ఆ తర్వాత చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి ఐదు నుంచి ఏడు నిమిషాల పాటు మరిగించాలి. ఆ తర్వాత ఈ నీటిని వడగట్టి ఒక స్పూన్ తేనెను కలిపి తాగాలి. ఒత్తిడి అనిపించినప్పుడు తలనొప్పి ఉన్నప్పుడు ఈ డ్రింకి తీసుకుంటే వెంటనే ఉపశమనం కలుగుతుంది. బాడీ అలాగే మైండ్ రిఫ్రెష్ అవుతుంది.

## అంజీర్‌లను ఇలా తీసుకుంటే ఒంట్లో షుగర్ దెబ్బకు నార్మల్!



రోజూ రెండు అంజీర్ పండ్ల తినడం వల్ల బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుందని అంటున్నారు. దీంతో పాటు అంజీర్‌లను తీసుకోవడం వల్ల గుండె సమస్యలు, క్యాన్సర్ లాంటి రోగాలు రాకుండా కాపాడుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. డయాబెటిక్ బాధితులు అంజీర్ పండ్లను తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు అంటున్నారు. అంజీర్ పండ్లలో పొటాషియం పోషకాలు ఎక్కువగా ఉంటాయని.. ఇందులో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లం రక్తంలో చక్కెర స్థాయులను తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. అంజీర్ పండ్లలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రక్తపోటు స్థాయులను సరిగ్గా ఉంచేలా సహాయపడతాయని వైద్యులు చెబుతున్నారు. అత్తి పండ్లను తినడం వల్ల శరీరంలో పెరిగిన ట్రైగ్లిజరైడ్ స్థాయిలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. కరోనరీ ధమనుల్లో అడ్డంకులను నివారిస్తుందని.. ఫలితంగా గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ పరగడపున అంజీర్ పండ్లను తినడం వల్ల హార్మోన్ల అసమతుల్యత సమస్య తొలగిపోతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మెనోపాజ్ సమయంలో ఉన్న మహిళలు, రుతుక్రమ సమస్యలతో బాధపడే అమ్మాయిలు హార్మోన్ల అసమతుల్యత సమస్యల బారిన పడుతూ ఉంటారు. వారంతా కచ్చితంగా అంజీర్ పండ్లను తింటే మంచిదని సూచిస్తున్నారు. రెండు అంజీర్లను రాత్రి నిద్రపోయే ముందు నీటిలో నానబెట్టాలి. వీలైతే వాటిలో బాదం, వాల్ నట్స్ కూడా వేసి నానబెట్టుకోవాలి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో వీటిని తినడం వల్ల పుష్కలమైన ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అంజీర్ పండ్లతో మలబద్ధకం సమస్యకు చెక్ పెట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యతో బాధపడేవారు రోజూ పరగడుపునే నానబెట్టిన రెండు అంజీర్ పండ్లను తినాలని సూచిస్తున్నారు. ఇవి ప్రేగు కదలికలను సరిచేసి.. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తాయని వివరిస్తున్నారు. అలాగే, పొట్ట ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందని అంటున్నారు.

## మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరి తినవచ్చా?

మధుమేహ వ్యాధిగ్రస్తులు తరచుగా ఇడ్లీ మరియు దోస తినేటప్పుడు కొబ్బరితో పాటు చట్నీని ఉపయోగిస్తారు. ఇది మంచిదేనా? ఇది చెడ్డదా? మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరి తినవచ్చా? కొబ్బరిని ఏ రూపంలోనైనా తీసుకోవచ్చు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. అయితే, ఆహారంలో కూడా సరైన సమయం మరియు సరైన ఆహారం అనుసరించాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా మూత్ర విసర్జనకు గురవుతారు మరియు అలసటగా అనిపించడం వలన వారి ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఏం తిన్నా షుగర్ పెరిగిందన్న ఫీలింగ్ రాకుండా ఉండలేం. ఈ జాబితాలో, మీరు బీట్‌రూట్, వేరుశెనగ, కొబ్బరి మొదలైనవి జోడించవచ్చు. బీట్‌రూట్: మధుమేహ వ్యాధిగ్రస్తులు బీట్‌రూట్ తినవచ్చా? అనే సందేహాలు చాలా మందికి ఉన్నాయి. కొవ్వుతో నిండిన పండు అయినప్పటికీ, బీట్‌రూట్‌లో సహజ చక్కెర ఉంటుంది, అది హానికరం కాదు. అంతే కాకుండా బీట్‌రూట్‌లో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది.అలాగే, బీట్‌రూట్‌లో పొటాషియం, ఐరన్ మరియు మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నందున టైప్ 2 డయాబెటిస్ రోగులకు చాలా మంచిదని అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల, భోజనానికి ముందు బీట్‌రూట్ తినడం అదనపు ప్రయోజనాలను అందిస్తుంది. వేరుశెనగ : వేరుశెనగలు కూడా చాలా మేలు చేస్తాయి. ఇది కమ్మటి రుచిని కలిగి ఉంటుంది మరియు చక్కెర తక్కువగా ఉంటుంది మరియు ఇందులోని మెగ్నీషియం ఇన్సులిన్ అనే హార్మోన్ స్రావాన్ని వేగవంతం చేస్తుంది మరియు చక్కెర స్థాయిని అదుపులో ఉంచుతుంది. వేరుశెనగలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, పీచుపదార్థాలు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి మరియు అవి చక్కెరను నియంత్రించే లక్షణాలను కలిగి ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి, మహిళలు 25 గ్రాముల వేరుశెనగ తినవచ్చు మరియు పురుషులు 38 గ్రాముల వేరుశెనగ తినవచ్చు. ప్రత్యామ్నాయంగా, మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు పరిమిత పరిమాణంలో వేరుశెనగను తీసుకోవచ్చు. పీచుపదార్థాలు : కొబ్బరికాయలు తింటే షుగర్ పెరుగుతుందనే భయం.. కొబ్బరిలో పీచుపదార్థాలు పుష్కలంగా ఉంటాయి.. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, విటమిన్ సి, బి కాంప్లెక్స్ ఇంకా మరెన్నో పోషకాలు ఉంటాయి కాబట్టి కొబ్బరికాయలకు ఎవరూ దూరంగా ఉండకూడదు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఫైబర్ మరియు కార్బోహైడ్రేట్లు చాలా అవసరం. ఈ రెండూ కొబ్బరిలో ఉండటం వల్ల బ్లడ్ షుగర్ స్పైక్‌లు కూడా నివారించబడతాయి. కానీ, కొబ్బరి నుంచి పాలు తీసుకోకుండా కొబ్బరితో కలిపి నమిలితే పీచు పూర్తిగా లభిస్తుంది.



## కంటి ఆరోగ్యానికి అద్భుతమైన ఫుడ్స్



సర్వేంద్రియానామ్ నయనం ప్రధానం అన్నారు మన పూర్వీకులు.. కళ్లు చాలా విలువైనవి.. వాటిని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడిపేస్తున్నారు. కంటి చూపు ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్ ఎ తీసుకోవడం అవసరం. ఈ పోషకం కంటి రెటీనాను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా రేచీకటి, అంధత్వం, పొడిబారడం వంటి దృష్టి సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. కంటి చూపును మెరుగ్గా ఉంచుకోవడంలో సహాయపడే 5 విటమిన్ ఎ ఆధారిత ఆహార పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకోండి.. క్యారెట్లు: క్యారెట్లలో మన కళ్లను కపాడుతాయి.. క్యారెట్లలో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది. క్యారెట్‌లను రోజూ తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. కంటి సంబంధిత వ్యాధుల భయం తగ్గుతుంది. బీట్‌రూట్: బీట్‌రూట్ లలో బీటా కెరోటిన్ కూడా పుష్కలంగా ఉంటుంది. కంటికి అద్భుతమైన ఆహార పదార్థం. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఇతర శరీర విధులకు కూడా మేలు చేస్తాయి. గుడ్డు: గుడ్డు పచ్చసొనలో విటమిన్ ఎ, ఇతర పోషకాలు ఉన్నాయి. ఇవి కంటి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. గుడ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కంటి కండరాలు బలపడతాయి.. ఇంకా కంటి చూపు మెరుగుపడుతుంది. ఆకుకూరలు: పచ్చి ఆకు కూరలలో బచ్చలికూర విటమిన్ ఎకి మంచి మూలం. ఇందులో ల్యూటిన్, జియాక్సంతిన్ అనే సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి హానికరమైన ఖఎ కిరణాల నుంచి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110